క్లుప్తంగా

మహేశ్‌గౌడ్‌ను కలిసిన నాయకులు



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న మండల నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్ మల్లికార్జున్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య, యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

దుబ్బాకరూరల్: నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కమలాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటుగా అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతారెడ్డిపేట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ



జూనియర్ కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): ఇంటర్ విద్యార్థులకు సిలబస్‌తో పాటుగా పోటీ, ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సిద్దిపేట డీఐఈఓ కే రవీందర్‌రెడ్డి సూచించారు. బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎంసెట్, నీట్, జేఈఈ తదితర ప్రవేశాల కోసం ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం డీఐఈఓ రవీందర్‌రెడ్డిని అధ్యాపక బృందం సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే



దుబ్బాకలో బీజేపీ సభ్యత్వ నమోదులో సుభాష్ చందర్, బీజేపీ నేతలు

దుబ్బాక: రాష్ట్రంలో బలమైన పార్టీగా బీజేపీ అవతరించబోతోందని హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్ అన్నారు. బుధవారం పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పట్ల కొద్ది రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత నెలకొందన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా బీజేపీనే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, సుంకోజి ప్రవీణ్, తిరుమల్‌రెడ్డి, భాస్కర్, భిక్షపతి, రమణారెడ్డి, బద్రి, యాదగిరి తదితరులు ఉన్నారు.

రైతుల వివరాల సేకరణ



రాయపోల్‌లో దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఓ నరేశ్

సాక్షి ఎఫెక్ట్..

దుబ్బాకటౌన్: వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను రాయపోల్ ఏఓ నరేశ్ పరిశీలించి రైతుల నుంచి వివరాలను సేకరించారు. బుధవారం మొక్కజొన్న రైతుకు కష్టం అనే కథనం 'సాక్షి' ప్రచురించింది. దీనికి స్పందించిన ఏఓ రైతుల నుంచి వివరాలను సేకరించి, వర్షాలకు నష్టం వాటిల్లితే వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారికి సమాచారం ఇవ్వాలని కోరారు. మండలంలో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, రజిత తదితరులున్నారు.

ఎకోదంతుడికి జై

- నాలుగేళ్లుగా పూజలందుకుంటున్న మట్టి గణపతులు
- డీజేలు, హంగామాలకు దూరం
- పల్లకీ మోస్తూ..భజనలు చేస్తూ శోభాయాత్ర
- ఆదర్శంగా నిలుస్తున్న నెంటూరు హనుమాన్ భక్తబృందం



నెంటూరులో కొలువుదీరిన మట్టి వినాయకుడు

ఎకో ఫ్రెండ్లీ మట్టి గణపతికే ప్రజలు జై కొడుతున్నారు. దీనివల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదు. మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించి అందరి మన్ననలు పొందుతున్నారు. మట్టి ప్రతిమలను పూజిస్తూ, పర్యావరణానికి పరిరక్షిస్తూ తమ వంతుగా కృషి చేస్తున్నారు. మిరుదొడ్డికి చెందిన యువ భారత్ యువకులు, వర్గల్ మండలం నెంటూరు హనుమాన్ భక్తబృందం వారు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

వర్గల్(గజ్వేల్): ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మెరుగులు, ఎనామిల్ రంగుల మిలమిలలు మనకొద్దు.. పర్యావరణహిత మట్టి వినాయకులనే పూజిద్దాం .. అనే సందేశం పంచుతూ, నాలుగేళ్లుగా తాము ఆచరిస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు వర్గల్ మండలం నెంటూరు హనుమాన్ భక్తబృందం సభ్యులు. చెవులు చిల్లులుపడే డీజే సౌండ్, బ్యాండ్ హంగామాలకు దూరంగా గణేశుని పల్లకీ మోస్తూ, భజనలు చేస్తూ నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తూ..ఆధ్యాత్మిక వైభవానికి, పండుగల పరమార్థానికి ప్రతీకగా నిలుస్తున్నారు. రేపటి తరానికి గణేశ్ ఉత్సవాలు ఇలా నిర్వహించుకోవాలని చాటుతున్నారు.



భజనల మధ్య కొనసాగుతున్న నెంటూరు వినాయకుని శోభాయాత్ర (ఫైల్)

నాలుగేళ్లుగా మట్టి వినాయకుడే

నెంటూరు హనుమాన్ ఆలయం వద్ద 'హనుమాన్ భక్తబృందం' ప్రతీవారం భజనాది కార్యక్రమాలు నిర్వహిస్తుంటుంది. ఆలయం వద్ద ప్రతీయేటా వినాయక విగ్రహం ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఎనామెల్ రంగుల వినాయకులకు స్వస్తి పలికి, నాలుగేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించుకుని నవరాత్రోత్సవాలు నిర్వహించుకుంటున్నారు. ప్రతీరోజు గణేశునికి పూజలు, సాయంత్రం భజనలతో ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా వేడుకలు నిర్వహిస్తుంటారు.

వినూత్నంగా..
ఆదర్శంగా గణేశుని పల్లకీ...

నెంటూరులో గణేశుని నిమజ్జన శోభాయాత్ర ప్రత్యేకంగా నిలుస్తుంది. డీజే శబ్దాల హోరు, బ్యాండ్ హంగామాలు మచ్చుకైనా కన్పించవు. వినాయకుని ప్రతిమ పల్లకీపై అధిష్ఠింపజేస్తారు. పల్లకీ మోస్తూ, భజనలు చేస్తూ పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా ఊరంతా గణనాథుని శోభాయాత్రలో భాగస్వాములవుతారు. గ్రామ చెరువులో నిమజ్జనం చేస్తారు. 'పర్యావరణాన్ని పరిరక్షించి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, అందమైన సమాజాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది. భారతీయ సంస్కృతిలో ప్రకృతి ఆరాధనకే అధిక ప్రాధాన్యత ఉంది. అందువల్ల మా ఆలయం వద్ద మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించుకుంటున్నామంటున్నారు' నెంటూరు హనుమాన్ భక్తబృందం.

రామకోటి రామరాజు సన్మానం

నాలుగేళ్లుగా మట్టివినాయకుని విగ్రహం ఏర్పాటు చేసుకుని నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్న నెంటూరు హనుమాన్ భక్తబృందం పరివారం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని రామకోటి రామరాజు పేర్కొన్నారు. మంగళవారం వారిని సన్మానించి అభినందించారు.

12 ఏళ్లుగా పర్యావరణ హితం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 12 సంవత్సరాలుగా వినాయక నవరాత్రోత్సవాలల్లో భాగంగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణ హితానికి యువ భారత్ యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణానికి కలిగే హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారైన వినాయక విగ్రహాలకు స్వస్తి పలికి ఏడడుగుల మట్టి వినాయక విగ్రహాలను ప్రతీ యేటా ప్రతిష్ఠిస్తూ నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నిత్య పూజతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మన్ననలు పొందుతున్నారు.



మిరుదొడ్డిలో యువ భారత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన ఏడడుగుల మట్టి వినాయకుడు

పర్యావరణానికి విఘాతం కలిగించొద్దనే..



సంస్కృతీ సంప్రదాయాలకు పెట్టింది పేరుగా నిలిచే వినాయక నవరాత్రోత్సవాల వల్ల పర్యావరణానికి విఘాతం కలిగించొద్దన్న లక్ష్యంతో 12 ఏళ్ల మా యూత్ సభ్యులందరం తీసుకున్న తీర్మానం ప్రకారం మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నాం.

– గంజి కొండల్ రెడ్డి, యువ భారత్ యూత్ కోశాధికారి, మిరుదొడ్డి

ఏటా మట్టి వినాయకుల ఏర్పాటు



పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించనటు వంటి మట్టి వినాయకులను ప్రతీ సంవత్సరం ఏర్పాటు చేస్తున్నాం. కరీంనగర్, కామారెడ్డి వంటి పట్టణాల్లో తయారు చేసిన మట్టి విగ్రహాలను కొని ప్రతిష్ఠిస్తున్నాం. నిత్యం భక్తుల పూజలందుకుంటున్న మా మట్టి వినాయక మండపం వద్ద భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అన్న, తీర్థ ప్రసాద వితరణ చేస్తున్నాం.

– పిట్ల నాగరాజు, యువ భారత్ యూత్ అధ్యక్షుడు, మిరుదొడ్డి

'భగీరథ' నీరు వృథా



గౌరారం వద్ద లీకేజీ అవుతున్న భగీరథ పైపులైన్

వర్గల్ మండలం గౌరారం వద్ద పాములపర్తి రోడ్డు మార్గంలో 'భగీరథ' పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ వల్ల నీరు వృథా అవుతున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి నీరు రోడ్డు పాలవుతున్నాయి. పాములపర్తి మార్గంలో నీటి ప్రవాహానికి వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా నీరు రోడ్డు పాలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. పెద్ద పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టిన సందర్భంగా భగీరథ పైపునకు లీకేజీ ఏర్పడిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్ పేర్కొన్నారు. నీటి సరఫరా నిలిపేసి తక్షణ మరమ్మతులు చేపడతామన్నారు.

– వర్గల్(గజ్వేల్):

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



చెరువును సందర్శిస్తున్న చైర్ పర్సన్ స్వరూపరాణి, సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): గణేశ్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని స్థానిక చెరువు వద్ద చేపట్టవలసిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు చైర్‌పర్సన్ స్వరూపరాణి పలు సూచనలు చేశారు. బుధవారం కుడి చెరువును సీఐ ఎల్. శ్రీను, కమిషనర్ నాగేందర్, తహసీల్దార్ సమీర్ హైమద్ ఖాన్‌లతో కలిసి ఆమె సందర్శించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా పలు శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. వినాయక నిమజ్జనానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు కేటాయిస్తామన్నారు. వినాయక మండపాల ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులు అధికారుల సూచనలు సలహాలు పాటించి నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్ఐ నీరేశ్, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం, నిందితులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. నమ్మదగ్గ సమాచారం మేరకు బుధవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడులు చేయగా గ్రామానికి చెందిన అనరాశి ఉప్పలయ్య, కనకయ్య, బాలయ్యలు అక్రమంగా నిల్వ చేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వండి

కలెక్టర్‌కు బల్వంతాపూర్ వాసుల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

దుబ్బాకరూరల్: అనర్హులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇచ్చారని మండలంలోని బల్వంతాపూర్ గ్రామప్రజలు తెలిపారు. బుధవారం కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం నివాసముంటున్న ఆ ఇళ్లలో అనర్హులు ఉంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు, భూములు, ఆస్తులు ఉన్నవారే డబుల్ బెడ్ రూమ్‌లలో ఉంటున్నారని తెలిపారు. నిజమైన అర్హులను గుర్తించి వీటిని ఇవ్వాలని కోరారు. సత్తయ్య, సత్యనారాయణ, రవీందర్, స్వామి, విద్యాసాగర్, నజీర్, రమేశ్, భాను, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, పిల్లల రక్షణకు ప్రాధాన్యం

- ఇన్‌స్పెక్టర్ దుర్గ



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమయాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో అభివృద్ధిలోకి రావాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ అన్నారు. జిల్లా కేంద్రంలోని లింగారెడ్డి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో షీటీం, ర్యాగింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, అపరిచిత ఫోన్ కాల్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ప్రతీ ఒక్కరం తప్పనిసరిగా అవగాహన కల్గిండాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదువుకోవాలన్నారు. మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేశామన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని స్కూళ్లలో షీటీమ్ ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థినులను ఎవరైనా అవహేళన, అసభ్య పదజాలం, ర్యాగింగ్‌లతో ఇబ్బందులకు గురి చేస్తే షీటీం ఫిర్యాదుల బాక్స్‌లో లేఖ రాసి వేయాలన్నారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దని, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉందని, సెల్‌ఫోన్‌కు విద్యార్థులు అలవాటుపడొద్దన్నారు. ఏమైన ఆపద వస్తే వెంటనే డయల్ 100, షీటీమ్ నెంబర్ 87126-67434 కు ఫోన్ చేసి సమాచారం అందించి, సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమీల, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

సిద్దిపేటజోన్: పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక విక్టరీ చౌరస్తా, ముస్తాబాద్ చౌరస్తా, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం బోలార్డ్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా రేడియం స్టిక్కర్స్‌తో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల ఎదురెదురుగా వచ్చి వాహనాలు రోడ్డు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, రఘు, సదాశివరావు తదితరులు ఉన్నారు.

తల్లుల ఆరోగ్యమే బిడ్డలకు రక్ష

- సీడీపీఓ జయ



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ జయ

హుస్నాబాద్‌రూరల్: తల్లుల ఆరోగ్యామే బిడ్డలకు ఆరోగ్య రక్ష అని ఐసీడీఎస్, సీడీపీఓ జయ అన్నారు. బుధవారం మండలంలోని పోతారం(ఎస్), నాగారం గ్రామాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలల్లో గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. నెలకు 16 కోడి గుడ్లు ఇస్తున్నామని చెప్పారు. ఉమ్మడి కుటుంబంలో ఉండే గర్భిణులు ఆహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. నిత్యం అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. నెల నెల వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం. రజాక్, సూపర్ వైజర్లు తిరుమల, కవిత, టీచర్లు శారద, వనిత, రాజమణి, పంచాయతీ కార్యదర్శులు రాజమ్మ, కోటి శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు విద్యుత్ షాక్

హుస్నాబాద్‌రూరల్: పారిశుద్ధ్య కార్మికులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ సంఘటన మండలంలోని మహ్మదాపూర్‌లో జరిగింది. బుధవారం సాయంత్రం పారిశుద్ధ్య కార్మికులు వెంకటయ్య, శ్రీకాంత్‌లు వీధిదీపాలు అమర్చుతున్నారు. ఇనుప నిచ్చెన సహాయంతో విద్యుత్ స్తంభాలెక్కి పైన వీధిదీపాలు బిగించారు. నిచ్చెన తీస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగల పై పడింది. దీంతో ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురయ్యారు. వెంటనే స్థానికులు స్పందించి వారిని ప్రమాదం నుంచి తప్పించి హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించిన తర్వాత మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతులను ఆదుకోవాలి

గజ్వేల్: పంట నష్టానికి గురైన రైతులను ఆదుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి కోరారు. బుధవారం గజ్వేల్‌లో ఏడీఏ బాబునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పంట నష్టం లెక్కలు తీసి రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

◆ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేలా అందరం కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నారాయణరావుపేట మండల వైస్ ప్రెసిడెంట్ గా బొంగురం శారదకు నియామక పత్రాలు అందజేశారు. సిద్దిపేట టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉప్పెరెట్ల సంతోష, వైస్ ప్రెసిడెంట్ గా భవాని, కోదండరావపల్లి గ్రామ అధ్యక్షురాలుగా భార్గవి లకు సైతం నియామక పత్రాలను ఇచ్చారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దంలక్ష్మి, సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రటరీ మంద వనజ తదితరులు పాల్గొన్నారు.

◆ అసభ్యంగా ప్రవర్తిస్తే కేసు : సీఐ

మద్దూరు(హుస్నాబాద్): ఆటోలోఎక్కే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని చేర్యాల సీఐ శ్రీను హెచ్చరించారు. బుధవారం మండలపరిధిలోని అన్ని గ్రామాల ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల, పిల్లల పట్ల ప్రతీ ఆటోడ్రైవర్ మర్యాదగా ప్రవర్తించి, క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ మహబూబ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

◆ మద్యం తాగి వాహనాలు నడపొద్దు

గజ్వేల్‌రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. ఇటీవల గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పిడిచెడ్, క్యాసారం, తూప్రాన్, ముట్రాజీపల్లి, సంగాపూర్ రోడ్డు చౌరస్తాల వద్ద వాహనాలను తనిఖీ చేపట్టగా 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. బుధవారం గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక విచారణ జరిపి 15 మందికి రూ. 30వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కాగా వాహనదారుల కుటుంబ సభ్యులకు అనర్థాలను వివరిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు.

◆ ప్రభుత్వ బాలికల కళాశాలలో ఫ్రెషర్స్ డే

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్ డే నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని దానిని సాధించేందుకు నిరంతరం కష్టపడాలన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కళాశాలలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. విద్యార్థినిలు కష్టపడి చదివి ఈపీసెట్, నీట్ తదితర పోటీపరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాణి, అధ్యాపకులు, వనజ, రమాదేవి, వందన, రూప, శారద, శ్రీనివాస్, లక్ష్మీప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

◆ ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

సిద్దిపేటకమాన్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ నాయిని నర్సింహ్మారెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దాని గురించి మాట్లాడే అర్హత ఆపార్టీ ఎమ్మెల్యేలకు లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రూ. 2 లక్షల రుణమాఫీ దశలవారీగా కొనసాగుతోందన్నారు. కిసాన్ జిల్లా కార్యదర్శులుగా భూపతిరెడ్డి, కరుణాకర్‌లను నియమిస్తూ నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

దెబ్బతిన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారంలో దెబ్బతిన్న మొక్కజొన్నను బుధవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి పరిశీలించారు. గ్రామానికి చెందిన నీల కిష్టయ్యకు చెందిన మొక్కజొన్నకు తెగుళ్ల సోకగా సిద్దిపేటలోని ఓ పెస్టిసీడ్స్ దుకాణంలో తెచ్చిన మందులను పిచికారీ చేశాడు. అనంతరం పంటంతా దెబ్బతింటే శాస్త్రవేత్తలను సంప్రదించాడు. వారు పరిశీలించి వర్షాలకు మొక్కజొన్న పంటకు కాండం తొలిచే పురుగు ఆశిస్తే దుకాణాదారుడు సరైన మందులు ఇవ్వకుండా వేరే మందులు ఇవ్వడం వల్ల పురుగు ఉధృతి పెరిగిందని, పంటంతా దెబ్బతిందనే విషయాన్ని గుర్తించారు.